# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# బీజేపీ వ్యక్తిపూజ మ్యానిఫెస్టో

**ఎన్నికల** సీజన్ వచ్చిందంటే ప్రతి పార్టీ ఓ మ్యానిఫెస్టో విడుదల చేయడం ఆనవాయితీ. పార్టీ ఇచ్చే వాగ్దానాలన్నిటిని గుదిగుచ్చి అందులో ఏకరువు పెడతారు. ఇటీవలి కాలంలో మ్యానిఫెస్టోలకు అందమైన పేరు పెట్టడమూ చూస్తున్నాం. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోను 'పాంచ్ న్యాయ్' (ఐదు న్యాయాలు) అని పిలిస్తే.. తాజాగా విడుదలైన బీజేపీ మ్యానిఫెస్టోకు 'బీజేపీ సంకల్ప పత్ర.. మోదీకీ గ్యారెంటీ' అని ఓ అసాధారణమైన పేరును తగిలించారు. ఓ జాతీయ పార్టీ మ్యానిఫెస్టోకు ఓ వ్యక్తి పేరు తగిలించడం విశేషమే కదా! మ్యానిఫెస్టో పేరులోనే కాదు లోపల నిండా మోదీ పరుచుకుని ఉండటం గమనార్హం. 2014 మ్యానిఫెస్టోలో మోదీ పేరు కేవలం మూడుసార్లు మాత్రమే వస్తే ఇందులో 65 సార్లు ప్రస్తావనకు రావడం పదేండ్లలో మారిన బీజేపీ పరిస్థితికి అద్దం పడుతున్నది. ఇందులో ఇచ్చిన గ్యారెంటీలు ఏ మేరకు ఓట్లు తెస్తాయనేది అలా ఉంచితే, మోదీయే తమకు దిక్కు అని బీజేపీ గట్టిగా నమ్ముతున్నట్టు మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. ఎప్పుడైనా పాత హామీలు ఏ మేరకు అమలయ్యాయనేదాన్ని బట్టి కొత్త హామీల మీద నమ్మకం ఏర్పడుతుంది. ఈ విషయంలో బీజేపీ రికార్డు అంతంత మాత్రంగానే ఉన్నది. ఉదాహరణకు 2019 మ్యానిఫెస్టోలో 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. ఇది అమలైందా లేదా అనేది తెలుసుకునేందుకు పెద్దగా అధ్యయనం చేయాల్సిన పనిలేదు. రైతులు డిమాండ్ల కోసం మళ్లీ ఉద్యమబాట పట్టడం చూస్తే బీజేపీ హామీ ఏ మేరకు అమలైందో తెలుస్తుంది. కనీస మద్దతు ధర హామీ పరిస్థితి కూడా అంతే. ఇక ఉద్యోగాల హామీ, ఖాతాల్లో 15 లక్షల గురించి ఎంత తక్కువగా చెప్పుకొంటే అంత మంచిది.

అందుకే గత పదేండ్లలో ఏం సాధించారో చెప్పకుండా కేవలం మోదీ ఇమేజీ మీద ఆధారపడి బీజేపీ రంగంలోకి దిగింది. పోయిన సారి జాతీయ పౌర రిజిస్ట్రీ (ఎన్ఆర్సీ)ని అచిరకాలంలోనే అమలు చేస్తామని చెప్పారు. ఈసారి మ్యానిఫెస్టోలో దాని ప్రస్తావనే లేకపోవడం మారిన బీజేపీ ప్రాధాన్యాలను తెలియజేస్తున్నది. ఇంతకూ 2024 మ్యానిఫెస్టోలో ఏమున్నది? అని తరచి చూస్తే ప్రత్యేకమైన అంశాలు ఏవీ కనిపించవు. ప్రజలు ఆశగా, ఆర్తిగా ఎదురుచూస్తున్న అనేక అంశాలపై మ్యానిఫెస్టోలో ఎలాంటి హామీలు లేకపోవడం గమనార్హం. రైతురుణమాఫీ, ఆదాయపన్ను రాయితీ, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ పెంపు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, జాతీయ ప్రాజెక్టు హోదాల వంటివి నామమాత్రంగానైనా ప్రస్తావించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పైపై మెరుగులతో పాతను కొనసాగిస్తామనడం తప్ప కొత్తగా తెచ్చే మార్పులేవీ ఉండబోవని బీజేపీ మ్యానిఫెస్టోను చూస్తే అర్థమవుతుంది. మహిళాశక్తి, యువశక్తి, రైతులు, పేదలు అనే నాలుగు స్తంభాలపై వికసిత భారతాన్ని ఆవిష్కరిస్తామని ప్రధాని మోదీ అంటున్నారు. గత పదేండ్లలో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురయ్యారని విపక్షాలు చెప్తున్నవి కూడా ఈ నాలుగు వర్గాలే కావడం గమనార్హం. ఇంటింటికీ వంటగ్యాస్, సౌరశక్తి ద్వారా ఉచిత విద్యుత్తు వంటి హామీలు మ్యానిఫెస్టోలో చోటుచేసుకోదగిన స్థాయివి కావు. ఇకపోతే ఉచితాలు. విపక్షాలు ఉచితాలను హామీ ఇస్తే రేవడీలు (తాయిలాలు) అని ఈసడించిన బీజేపీ మరో ఐదేండ్లు పేదలకు ఉచిత ధాన్యం పంపిణీ కొనసాగిస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇవ్వడం ఓ వైచిత్రి. పేదరికం గత పదేండ్లలో తగ్గకపోగా పెరిగింది. మరో ఐదేండ్లూ పరిస్థితి అంతే. ఇది బీజేపీ మ్యానిఫెస్టో చెప్పకుండానే చెప్పిన సంగతి.

ప్రజల నుంచి వచ్చిన 15 లక్షల సూచనలతో మ్యానిఫెస్టో రూపొందిందని బీజేపీ నేతలు అంటున్నారు. కొందరు లబ్ధిదారులను పిలిపించి మ్యానిఫెస్టో విడుదల వేదికపై సన్మానించడం విశేషం. ఈ తతంగమంతా బీజేపీ ఆత్మవిశ్వాసాని కంటే అపనమ్మకాన్నే తెలియజేస్తున్నది. సరికొత్త మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వేదిక మీద అంబేద్కర్ బొమ్మ, రాజ్యాంగ గ్రంథాన్ని అమర్చడం అదనపు చేర్పు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తుందనే విపక్ష ప్రచారాల నేపథ్యంలో ఈ హంగామాను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అంబేద్కర్ స్వయంగా వచ్చినా రాజ్యాంగాన్ని మార్చలేడంటూ ప్రధాని మోదీ ఇటీవల చేసిన ప్రకటన కూడా అంతే. 'హామీ' స్థానంలో 'గ్యారెంటీ' అనే మాటను ఇటీవలి కాలంలో కాంగ్రెస్ ఎక్కువగా వాడుకలోకి తెచ్చింది. ఆ మాట ను బీజేపీ అక్కున చేర్చుకోవడమే కాకుండా మోదీ పేరు తగిలించి తలకెత్తుకుంటున్నది. వాడి పారేసే వస్తువులకు ఇచ్చే 'గ్యారెంటీ' అనే పదాన్ని ఎన్నికల హామీలకు చేర్చడం ఈ కాలపు వింతే మరి.

# జాతీయ పార్టీలను నమ్మొద్దు

**భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మన దేశాన్ని సుమారు అరవై ఏండ్లకు పైగా పాలించింది. ప్రస్తుతం దేశాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పదేండ్లు వరుసగా తన ఆధిపత్యం చెలాయించి, మూడోసారి కూడా తామే అధికారంలోకి వస్తున్నామంటూ ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తూ వారిని తప్పదోవ పట్టిస్తున్నది. ఈ రెండు జాతీయపార్టీల వైఖరి నన్ను ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.**

**ఈ పార్టీలు వేర్వేరు అయినప్పటికీ ఆ పార్టీలు అవలంబించే విధానం, వాటి ప్రధాన సిద్ధాంతం మాత్రం ఒక్కటే. దేశంలోని పేద ప్రజల పొట్ట కొట్టి కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టడమే. అందుకే స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా దేశంలో ఇంకా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించలేకపోయాయి. పేదలకు మూడు పూటలా తినడానికి తిండి దొరకడం లేదనే వాస్తవం మన దేశ పరిస్థితిని చెప్పకనే చెప్తున్నది. 2023 ప్రపంచ ఆకలి సూచీ ప్రకారం.. 125 దేశాలున్న జాబితాలో మన దేశం 111వ స్థానంలో ఉండటమే దానికి తాజా ఉదాహరణ.**



**సర్దార్ రవీందర్ సింగ్**



వారసత్వంగా తండ్రి నుంచి వచ్చిన ఆస్తిపాస్తుల వలె.. ' నువ్వు, లేదంటే నేను' అన్నట్టు కాంగ్రెస్, బీజేపీ దేశంలో అధికారాన్ని పంచుకుంటున్నాయి. ఫలితంగా దేశంలోని పేద ప్రజలు ఇంకా పేదరికాన్ని అనుభవిస్తుంటే సంపన్నులు మాత్రం కోట్లకు మెట్లు కడుతూనే ఉన్నారు. దేశ జనాభాలో 3 శాతం మంది మాత్రమే నిరుపేదలున్నారని చెప్పే కేంద్ర ప్రభుత్వం కోట్లాది మంది నిరుపేదలకు రేషన్ సరుకులు ఫ్రీగా ఇవ్వడం దేన్ని సూచిస్తున్నది. వీరందరూ ఒక్క పూట కూడా తిండికి నోచుకోక తీవ్రమైన పేదరికంలో బతుకీడుస్తుండటం మన దేశ దారిద్ర్యాన్ని తెలుపుతున్నది. అయినా మన దేశ ఏలికలకు చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం బాధాకరం. 2 జీ స్పెక్ట్రం, బోఫోర్స్, కామన్‌వెల్త్, బొగ్గు వంటి ఎన్నో స్కామ్‌లు చేసిన కాంగ్రెస్ పార్టీతో ప్రజలు విసిగి వేసారిపోయారు. తద్వారా స్కాంగ్రెస్‌గా పేరొందిన కాంగ్రెస్ పార్టీ 2014లో దేశంలో అధికారాన్ని కోల్పోయింది. అప్పటినుంచి మొదలు ఇప్పటివరకు ప్రజా సమస్యల పట్ల కాంగ్రెస్ పార్టీ గట్టిగా పోరాడింది లేదు. 'ఉన్నవా బసవన్నా' అంటే.. 'ఉన్నా'..., 'తిన్నవా బసవన్న' అంటే 'తిన్నా' అన్నట్టు వ్యవహరిస్తున్నది.

గుజరాత్ ముఖ్యమంత్రిగా 2014కు ముందు ఆకాశానికి నిచ్చెనలు వేసిన నరేంద్ర మోదీ దేశ ప్రజలకు గాల్లో మేడలు కట్టి చూపెట్టారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి దేశంలోని ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాటలు నమ్మిన దేశ ప్రజలు బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారు. రూ.15 లక్షలేమో కానీ, రూ.15 వేలు కూడా ప్రజల ఖాతాల్లో జమచేయలేకపోయారు ప్రధాని మోదీ. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన మోదీ విదేశీ ప్రయాణాలకు మొగ్గు చూపెట్టారు. పూటకు రెండు, మూడు డ్రెస్‌లు మారుస్తూ, పూటపూటకో ఫొటోషూట్‌లో పాల్గొంటూ దేశ ప్రయోజనాలను గాలికి వదిలేశారు. పెద్ద నోట్ల రద్దు నుంచి మొదలు జీఎస్టీ అమలు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను అమలుచేస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాశారు. దీంతో దేశంలోని రైతాంగం ఢిల్లీ వేదికగా పెద్ద ఎత్తున నిరసనలు తెలిపింది. ధర్నాలు చేసింది, రాస్తారోకోలు చేసింది. ఈ క్రమంలో ఎందరో రైతులు తమ ప్రాణాలను వదులుకున్నారు. ఇంత జరిగినా ఎక్కడో మూలన నక్కినక్కి కూర్చున్న కాంగ్రెస్ రైతు మరణాల పట్ల కనీసం సానుభూతి కూడా ప్రకటించకపోవడం హేయనీయం. జరగాల్సిన ఘోరం జరిగిన తర్వాత తేరుకున్న మోదీ సర్కారు వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. రైతులు తమ నిరసనలను విరమించుకుంటే గానీ దేశం ఊపిరి పీల్చుకోలేదు.

గతం గతః... అనే సూక్తిని గుర్తుపెట్టుకున్నట్టున్నాయి ఈ జాతీయ పార్టీలు. అందుకే ఎన్నికలు సమీపిస్తున్నాయంటే చాలు కండలు తిరిగిన యోధుడిలా ప్రజల ముందుకు వస్తున్నది కాంగ్రెస్ పార్టీ. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు కొల్లగొట్టడానికి, తద్వారా కోట్ల కుంభకోణాలు చేసేందుకు స్కాంగ్రెస్ పార్టీ సిద్ధం కావడం సిగ్గుచేటు. ఇక బీజేపీ మూడోసారి కూడా తామే అధికారంలోకి వస్తున్నామంటూ ప్రజలను మభ్యపెడుతున్నది. ప్రజలను, యువతను రెచ్చగొట్టడానికి ఆ పార్టీకి ఉన్న ఆయుధం ఏమిటో అందరికీ తెలిసిందే. మత ప్రాతిపదికన ఓట్లు రాబట్టుకోవడానికి మతాల మధ్య చిచ్చు పెట్టే ఆ పార్టీ వేయని పాచికలు లేవు. అందులో భాగంగానే జరగబోయే పార్లమెంటు ఎన్నికల ముంగిట 'అయోధ్య' రాముడిని వాడుకుంటున్నది.

**దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తీర్పుతో దేశంలోని కోట్లాది మంది కలలుగన్న రామమందిర నిర్మాణానికి పునాది పడింది. 500 ఏండ్ల స్వప్నాన్ని సాకారం చేసే బాధ్యతను శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు (ఎస్ఆర్‌జేటీకే) చేతికి సర్వోన్నత న్యాయస్థానం అప్పగించింది. ఇది స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఓ ట్రస్టు. కానీ, దీని కార్యక్రమాలు ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కనుసన్నల్లోనే జరుగుతుండటమే అభ్యంతరకరం.**

పైగా దీని చైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలో ప్రధాని ప్రిన్సిపల్ సెక్రెటరీగా విధులు నిర్వర్తించారు. అదీ కాకుండా ట్రస్టుకు జనరల్ సెక్రెటరీగా వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు చంపత్ రాయ్ ఉన్నారు. దీంతో అక్కడి పనులన్నీ ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే జరుగుతున్నాయి.

నయా అయోధ్య నిర్మాణంలో భాగంగా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులను మోదీ సర్కార్ చేపట్టింది. ఈ క్రమంలో రామ జన్మభూమి రియల్ ఎస్టేట్‌కు అడ్డాగా మారింది. ముఖ్యంగా గుజరాత్‌కు చెందిన బడా వ్యాపారులు అయోధ్యలో తిష్ట వేశారు. చిన్నచిన్న పనుల నుంచి పెద్దపెద్ద ప్రాజెక్టుల వరకు అన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి. చివరికి సరయూ నదిలో తిరిగే తెడ్డు పడవలు మాయమై, వాటి స్థానంలో క్రూయిజ్ బోట్లు దర్శనమిస్తుండటం గమనార్హం. 'అయోధ్య రాముడి' పేరు చెప్పుకొని మళ్లా అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీ 'అయోధ్య'ను పేద ప్రజలకు అందనంతగా మారుస్తున్నది. ఆధ్యాత్మిక నగరిగా అయోధ్యను తీర్చిదిద్దుతామని గొప్పలకు పోతున్న బీజేపీ ప్రభుత్వం రూ.1000 కోట్లతో మాస్టర్ ప్లాన్ వేసింది. దేశంలోని ప్రతి హిందువుకు రాముడు ఆరాధ్యదైవం. మతాలకతీతంగా రాముడిని కొలిచేవారు మన దేశంలో ఉన్నారు. ఆయన త్యాగాలను అన్ని మతాల వారు స్మరిస్తారు. రాముని జీవితం ప్రతీ యువకునికి స్ఫూర్తి. పేదలు, బీదలే రాముడి అసలైన భక్తులు. కానీ, వారికి అయోధ్యలో నేడు స్థానం లేకుండా పోయింది. రామ మందిరంలో బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమంలోనూ సామాన్యులకు స్థానం దక్కలేదు. వేల మంది సెలబ్రిటీల మధ్య ఆ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిన విషయం దేశంలోని ప్రతీ పేదబిడ్డకు తెలుసు. దీంతో భవిష్యత్తులోనూ సామాన్య ప్రజలకు అయోధ్యలో చోటు దక్కుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అయోధ్య అభివృద్ధి పేరిట చేస్తున్న కార్యక్రమాల కారణంగా రాముడు సాధారణ భక్తులకు దూరమవుతాడో? సాధారణ భక్తులే రాముడికి దూరమవుతారో? కాలమే సమాధానం చెప్పాలి. నయా అయోధ్యను తీర్చిదిద్దుతున్న బీజేపీ.. రామ జన్మభూమికి భక్తులను రప్పించే బాధ్యతను కూడా భుజాలకెత్తుకున్నది. భవిష్యత్తులో ఏటా 5 కోట్ల మంది అయోధ్యను సందర్శించే అవకాశం ఉందనేది ఓ అంచనా. అందుకు బీజేపీ అంతర్గతంగా ప్రణాళికలు రచించింది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు భక్తులను అయోధ్యకు తరలిస్తున్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నదే మోదీజీ వ్యూహం. దేశాన్ని అరవై ఏండ్లు కాంగ్రెస్ పాలిస్తే ఇంకో అరవై ఏండ్లు పాలించాలనే యోచనలో బీజేపీ ఉన్నది. అందుకోసం మతాల పేరిట రెచ్చగొట్టడానికైనా, దేశంలో విద్వేషాలను విరజిమ్మడానికైనా బీజేపీ వెనుకాడటం లేదు. అందుకు దేశంలోని జమ్ముకశ్మీర్ అల్లర్లు తాజా ఉదాహరణ! రాష్ట్రంలో భైంసా అల్లర్లు కూడా అందుకు నిదర్శనం. కాబట్టి కాంగ్రెస్, బీజేపీ విధానాలను రాష్ట్ర ప్రజలు ఎండగట్టాలి. ప్రాంతీయ పార్టీల అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించి చట్టసభలకు పంపండి. అప్పుడే దేశంలోని పేద ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. దేశం పట్ల కానీ, దేశ సమస్యల పట్ల గానీ అవగాహన, అంకిత భావం లేని నాయకులను చట్టసభలకు పంపితే మన దేశం ఇంకా వెనుకబడిపోతుందనడంలో కించిత్ అనుమానం అవసరం లేదు.

**(వ్యాసకర్త: కరీంనగర్ మాజీ మేయర్)**

# వేతన జీవుల వెతలు పట్టేదెవరికి?



**ప్రశాంత్ సాగి**
**70955 83999**

**సంవత్సరాలు క్షణాల్లా గడిచిపోతున్నాయి. మరో కొత్త ఆర్థిక సంవత్సరం రానే వచ్చింది. వేతన జీవులు ట్యాక్స్ డిక్లరేషన్, రిటర్నులు ఫైల్ చేసే సమయం మళ్లీ వచ్చేసింది. కానీ, వేతన జీవులకు పాలకులు ఇస్తున్న హామీలను అమలు చేసే సమయం మాత్రం రావడం లేదు. మన దేశంలో కచ్చితంగా పన్ను కట్టేది వేతన జీవులు, సామాన్యులు, మధ్యతరగతి వారే. పన్నులు కడుతూ దేశాన్ని సాదుతున్నవారిని ఆదుకుంటామని, పన్నులు తగ్గిస్తామని, నల్లధనం వెలికితీసి పన్ను చెల్లింపుదారులకు బహుమతిగా ఇస్తామని మోదీ గతంలో ప్రకటించారు. అయితే పదేండ్లుగా ప్రధానిగా కొనసాగుతున్న మోదీ.. ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. పైగా ఈ పదేండ్లలో ఆయన పాలనలో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు భారీగా పెరగగా.. పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనాలు మాత్రం తగ్గిపోయాయి.**



తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పులు లేవు. రూ.2.5 లక్షల కనీస ఆదాయ స్లాబ్‌ను పెంచకుండానే కొత్త పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. కొత్త పన్ను విధానంలో ఆదాయ పన్నుపై ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. వివిధ ప్రభుత్వ పథకాలలో పొదుపు చేయడాన్ని గత ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. దీని వల్ల ప్రభుత్వానికి, అలాగే పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూరుతుంది. కానీ, కొత్త పన్ను విధానం వల్ల భవిష్యత్తు కోసం పొదుపు చేసుకోవాలనే ఆలోచన లేకుండాపోయే ప్రమాదం ఉన్నది. కొత్త పన్ను స్లాబ్‌లో మినహాయింపులు లేకపోవడంతో ఉద్యోగుల భవిష్యత్తు అవసరాలకు కనీస భద్రత లేకుండాపోయింది.

జీఎస్టీ రాకతో వ్యాపారులతో పాటు సామాన్యుల జీవితాలు కుదేలైపోయాయి. 2016కు ముందు ఒక ఇల్లు లేదా ఫ్లాట్ కొంటే దానిపై జీఎస్టీ ఉండేది కాదు. కానీ, ఇప్పుడు జీఎస్టీ పేరిట అదనపు భారం పడింది. సగటున ఒక్కో ఫ్లాట్‌పై లక్షపైనే జీఎస్టీ కట్టాల్సి వస్తున్నది. ఇండ్ల ధరలు భారీగా పెరిగాయి. కొత్తగా వాటిపై కూడా జీఎస్టీ వేస్తున్నారు. అయినప్పటికీ ఇంటి రుణ వాయిదాలపై ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.1.5 లక్షలను ఇప్పటివరకు పెంచలేదు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌పై వడ్డీ పెంపు సహా ఎలాంటి మార్పులు లేవు. వైద్య ఖర్చులు పెరుగుతుండటంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు బీమా చేయించుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. అయితే దానిపై 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల సామాన్యులపై పెనుభారమే పడుతున్నది. ఎక్కువ మొత్తంలో బీమా కడితే 18 శాతం పన్ను వేసి, తక్కువ మొత్తం బీమాకు 5 శాతం పన్ను వేయాలనే ఆలోచన కూడా మోదీ ప్రభుత్వానికి కలగకపోవడం శోచనీయం. సంపన్నులను, పేదలను ఒకేగాటన కట్టేసి అందరిపై అధిక పన్నులు వసూలు చేయడం సరికాదు. ఏదైనా అనుకోని కారణాల రీత్యా ఆదాయ పన్ను రిటర్నులు సమర్పించడం ఒక్కరోజు ఆలస్యమైనా రూ.5 వేలు అపరాధ రుసుము వసూలు చేయడం పాలకులకు తగునా?

**పెట్రోల్, డీజిల్‌పై విపరీతంగా సుంకాలు పెంచి, రాష్ర్టాలకు ఆదాయంలో వాటా ఇవ్వకుండా సగటున లీటర్‌కు రూ.30 వరకు పెంచిన కేంద్రం.. ఈ పదేండ్లలో రూ.30 లక్షల కోట్లకు పైగా అదనపు ఆదాయాన్ని పొందింది. గతంతో పోలిస్తే ముడిచమురు ధరలు తగ్గినా ఇంధన ధరలను మోదీ సర్కార్ తగ్గించలేదు. పైగా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రూ.2 తగ్గించి చేతులు దులుపుకొన్నది. కనీసం రూ.15-20 వరకు తగ్గించే ఆస్కారం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుల నడ్డి విరుగుతున్నది.**

మోదీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ మూడేండ్లలోనే 60 శాతానికి పైగా పెరగడం గమనార్హం. గతంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ.900కి చేరింది. మొన్నటి వరకు రూ.1100కు పైగా ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఎన్నికల సమయం కావడంతో కాస్త తగ్గింది. జాతీయ రహదారులను నిర్మిస్తున్నామని గొప్పలకు పోతున్న కేంద్ర సర్కార్ టోల్ ట్యాక్సుల పేరిట వాహనదారుల తోలు తీస్తున్నది. 2014లో రూ.11,400 కోట్లున్న టోల్ వసూళ్లు 2024లో రూ.62,000 కోట్లకు చేరడమే అందుకు నిదర్శనం. ఏటా 5 శాతం ట్యాక్స్ పెంచడం, ఎక్కువ రహదారులను టోల్ ట్యాక్స్ పరిధిలోకి తేవడమే అందుకు ప్రధాన కారణం. అయితే ఈ వాస్తవాలను విస్మరిస్తున్న కేంద్ర మంత్రులు అసలు ధరలే పెరగలేదని మాట్లాడటం విడ్డూరం.

2023 సెప్టెంబర్‌లో ఆర్బీఐ ఇచ్చిన నివేదిక ప్రకారం.. మన దేశంలో సగటు కుటుంబాల పొదుపు రేటు జీడీపీలో 5.1 శాతానికి పడిపోయింది. గత నలభై ఏండ్లలో ఇదే అత్యంత తక్కువ పొదుపు రేటు కావడం గమనార్హం. అదే సమయంలో అప్పులు మాత్రం జీడీపీలో 40 శాతానికి పెరిగాయి. అప్పులలో ఎక్కువ భాగం క్రెడిట్‌కార్డులు, వ్యక్తిగత రుణాల విభాగంలోనే ఉన్నాయి. పెరిగిన ఖర్చులను సర్దుబాటు చేసుకోవడానికే ఆదాయం సరిపోవడం లేదని దీనర్థం.

దేశ ప్రజల ఆదాయాలు తగ్గాయనడానికి మరో ఆధారం ఐటీ రిటర్నుల సమాచారం. ఆదాయ పన్ను శాఖ లెక్కల ప్రకారం.. 2019-2020లో 6.47 కోట్ల మంది రిటర్నులు సమర్పించారు. వారిలో 2.9 కోట్ల మంది అంటే 45 శాతం (నిల్ రిటర్న్) పన్ను చెల్లించే ఆదాయం లేనివారున్నారు. 2022-23లో చూసుకుంటే.. 7.4 కోట్ల మంది రిటర్నులు సమర్పిస్తే, అందులో ఏకంగా 5.16 కోట్ల మంది అంటే 70 శాతానికి పైగా నిల్ రిటర్న్ ఫైల్ చేశారు. ఈ మూడేండ్లలోనే నిల్ రిటర్న్ ఫైల్ చేసినవారి సంఖ్య 78 శాతం పెరిగింది. అంటే.. దీన్నిబట్టే పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు.

**కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తాజాగా తన ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసింది. అందులో ప్రత్యక్ష పన్నుల్లో రాయితీ, ఆదాయ పరిమితి పెంపు లాంటి హామీల ప్రస్తావన చేయలేదు. జీఎస్టీ పన్నులను హేతుబద్ధీకరణ చేసే ఆలోచన కూడా బీజేపీకి లేదని మ్యానిఫెస్టో ద్వారా స్పష్టమైంది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష కాంగ్రెస్ మ్యానిఫెస్టో కూడా అస్పష్టంగానే ఉన్నది.**

మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తే సరిపోదు. కొంతమంది సంపన్నుల ఆదాయం పెరిగితే దేశం పురోగతి సాధించినట్టు కాదు. అందరి ఆదాయం పెరగాలి. ప్రజలు ఇప్పటికైనా తమ ఆలోచనా తీరును మార్చుకోవాలి. భావోద్వేగ పూరిత, విద్వేషపూరిత అంశాలను చూసి ఓట్లు వేయకూడదు. తమ బతుకుల్లో వెలుగులు నింపే వారినే ఎన్నుకోవాలి. అప్పుడే సామాన్యుల బతుకులు బాగుపడతాయి.



# రైతులకు భరోసా ఏది?

**రాష్ట్ర రైతాంగం దీనావస్థలో ఉన్నది. పరాయి పాలనలోని పరిస్థితులే పునరావృతం అవుతుండటంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. 'మార్పు' పేరిట అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం రైతుల బతుకుల్లో నిజంగానే మార్పు తీసుకొచ్చింది. నిన్నమొన్నటి వరకు కాలు మీద కాలేసుకొని దర్జాగా బతికిన కర్షకులు నేడు కన్నీళ్లు కారుస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.**

ఉమ్మడి పాలనలో ఆగమైన మన తెలంగాణ ఎవుసం స్వరాష్ట్రం సిద్ధించాక వెలుగులీనింది. స్వయంగా కాడి పట్టి ఎవుసం చేసిన కేసీఆర్ రైతుల తలరాతనే మార్చేశారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి సాగును బాగు చేశారు. 'మిషన్ కాకతీయ'తో చెరువులను పునరుద్ధరించి, కాళేశ్వరం జలాలను గ్రామాలకు మళ్లించి భూగర్భ జలాలను పెంచారు. ఆయన చేసిన అనితర కృషి వల్లనే బీడు భూముల్లోనూ బంగారం పండింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 18.2 శాతం రాబడి సాగు ద్వారా లభించింది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేసింది. కానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ రైతు బంధు ఆపేసి అన్నదాతలను అరిగోస పెడుతున్నది. రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయాన్ని పెంచుతామని మాట ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు రానురాను రైతుబంధును ఎత్తివేసే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధికి వ్యవసాయం గీటురాయి. అది నిజమని నమ్మిన కేసీఆర్ ఆ రంగాన్ని బాగుచేసేందుకు పూనుకున్నారు. అందుకోసం ప్రత్యేక పాలసీని రూపొందించారు. అందుకే ఉమ్మడి పాలనలో బియ్యానికి నోచుకోని తెలంగాణ.. నేడు ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్ తర్వాత దేశంలో రెండో స్థానంలో నిలిచింది. మేలు రకం వంగడాలు, సమగ్ర సస్యరక్షణ, మెరుగైన యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే సాయికి రాష్ర్టాన్ని తీసుకువచ్చారు. మెరుగైన మార్కెటింగ్ విధానాలతో వ్యవసాయ ఉత్పత్తులకు లాభసాటి ధరలు దక్కేలా చేసింది నాటి బీఆర్ఎస్ సర్కార్.

**కానీ, యాసంగి పంటలు ఎండిపోయి రైతులు విలపిస్తున్నా నేటి కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. నీటి వనరులను సక్రమంగా, సరైన సమయానికి వాడుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. అందుకే నీళ్లు అందుబాటులో ఉన్నా పంటలు ఎండిపోయాయి. ప్రాజెక్టుల నుంచి సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో మొన్నటివరకు మత్తళ్లు దుంకిన చెరువులు సైతం నెర్రెలుబారాయి. దీంతో వందల ఫీట్ల లోతుల్లోకి బోర్లు వేసినా ప్రయోజనం ఉండటం లేదు. భూగర్భ జలాలు అడుగంటిపోవడమే దానికి ప్రధాన కారణం.**

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందాన అకాల వర్షాలు అన్నదాతలను ఆక్రందనలు పెట్టిస్తున్నాయి. అకాల వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ పాలకులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నది. ఓ వైపు వాన ముప్పు, మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. పుట్ల కొద్దీ వడ్లను పండించినా గత ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం కాడి ఎత్తివేస్తున్నది. గోదాములేవంటే వరిధాన్యాన్ని కల్లాల నుంచి సేకరించలేకపోతున్నది. రైతులు వడ్ల కుప్పలకాన్నే బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారు.

కౌలు రైతుల పరిస్థితి కడు దయనీయంగా మారింది. పంటలు ఎండిపోవడంతో పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. దీంతో 20 లక్షల మందికి పైగా కౌలు రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు భూ యజమానులకు ముందస్తుగానే చెల్లించిన కౌలు రైతులు.. పెట్టుబడుల సంగతి పక్కన పెడితే, కౌలుకు చెల్లించిన మొత్తం అయినా తిరిగొచ్చే పరిస్థితి లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు వారిని కనీసం గుర్తించడం లేదు. ఇప్పటికే అనేక మంది రైతులు, కౌలురైతులు తనువు చాలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలి. కాడి వదిలేయకముందే కర్షకులను కాపాడుకోవాలి. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలి. దాంతో పాటు యాసంగి ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా రూ.500 బోనస్ ఇచ్చి ఆదుకోవాలి.



**మోటె చిరంజీవి**
**99491 94327**